క్లుప్తంగా

గ్రామాభివృద్ధిపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

మునగపాక: గ్రామాభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమావేశమయ్యారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని, ఇంటి పన్ను వసూళ్లపై కూడా దృష్టి సారించాలన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం

మునగపాక: రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు కోరారు. మండలంలోని జేపీ అగ్రహారంలో శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి ఇటువంటి సదస్సులు దోహదపడతాయన్నారు. అలాగే ఏళ్ల తరబడి పరిష్కారానికి నోచుకోని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రీ-సర్వే డీటీ పడాల్, పలువురు రైతులు సదస్సులో పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా కాళేశ్వరరావు



కాళేశ్వరరావుకు నియామక పత్రం అందజేస్తున్న పార్టీ సీనియర్ నేతలు

మునగపాక: మునగపాక మండల బీజేపీ అధ్యక్షునిగా నాగులాపల్లికి చెందిన మళ్ల కాళేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా ఎన్నికల అధికారి పరశురామరాజు, మండల ఎన్నికల అధికారి గొంతిన భక్త సాయిరాం శనివారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలో చురుగ్గా వ్యవహరించడంతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న వారిని గుర్తించి సముచిత స్థానం కల్పించనున్నట్లు తెలిపారు. పార్టీ నేతలు యల్లపు రాజేశ్వరరావు, పాలమరశెట్టి నాగేశ్వరరావు, భాస్కర్, డాక్టర్ బద్దెం సూర్యనారాయణ, సూరప్పారావు, ప్రతాప్, దొడ్డి సత్యనారాయణ, మళ్ల మల్లయ్యనాయుడు, కోలంకి నారాయణ, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు రేషన్ డీలర్ల ఆత్మీయ సమావేశం

మునగపాక: మునగపాక మండల రేషన్ డీలర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం ఆదివారం అచ్యుతాపురంలోని ఎంజీకే రీసార్ట్స్ వద్ద జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు కోనపల్లి రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే ఆత్మీయ సమావేశానికి డీలర్లు హాజరు కావాలని ఆయన కోరారు.

సర్వీస్ ప్రొవైడర్ల నియామకానికి దరఖాస్తులు

యలమంచిలి రూరల్: పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా)లో సర్వీస్ ప్రొవైడర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ప్లంబర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, ఏసీ, రిఫ్రిజిరేటర్, గీజర్లు, టీవీలు, వాషింగ్ మెషీన్ల వంటి గృ హోపకరణాల మరమ్మతులతో పాటు బ్యూటీషియన్ (మెన్ అండ్ ఉమెన్)గా సేవలందించడానికి సర్వీస్ ప్రొవైడర్ల నియామకానికి ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు పట్టణంలోని ధర్మవరం సచివాలయం వద్ద ఉన్న మెప్మా కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అర్హత కలిగిన అభ్యర్థులు వారి ఆధార్, పాన్, బ్యాంకు ఖాతా వివరాలు, విద్యార్హతకు సంబంధించిన జెరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మెప్మా కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు 7901610061 నంబర్‌లో సంప్రదించాలని మెప్మా సీఎంఎం డి. పద్మావతి తెలిపారు.

పర్యాటక సోయగం.. తంతడి తీరం



రెండు కొండల మధ్య అందంగా కనిపిస్తున్న సముద్రం



షూటింగ్ కోసం తంతడి తీరానికి వచ్చిన హీరో నాగచైతన్య (ఫైల్)



తంతడి శివారు వాడపాలెం వైపు గల ఇసుక తిన్నెలతో కూడిన తీరం

- సహజ అందాలు ఈ తీరం సొంతం
- పెద్ద ఎత్తున సినిమా షూటింగ్‌లు
- అయినా అభివృద్ధికి నోచుకోని వైనం

అచ్యుతాపురం: ప్రకృతి రమణీయతతో కట్టిపడేసే సుందర దృశ్యాలు కలగలసిన సముద్ర తీరం తంతడి. పిక్నిక్ ప్రియులు, పర్యాటకులు కచ్చితంగా సందర్శించే ప్రాంతం ఇది. అన్ని ప్రాంతాలు తమ సహజ సౌందర్యం కోల్పోయి కాంక్రీట్ జంగిల్‌గా మారిపోతున్న తరుణంలో పర్యాటక ప్రాంతాల్లో ఇప్పటికీ వన్నె తగ్గని సౌందర్యం తంతడి తీరం సొంతం. ముత్యాలమ్మపాలెం తీరం, పూడిమడక తీరం మధ్యలో ఉన్న ఈ సముద్ర తీరానికి ఎంతో ప్రత్యేకత ఉందని చెప్పాలి.

సహజసిద్ధమైన అందం..

పేరులో తంతడి బీచ్ అని ఉన్నప్పటికీ ఈ తీరం తంతడి గ్రామానికి కాస్త దూరంగానే ఉంటుంది. అచ్యుతాపురం మండలంలోని తంతడి గ్రామ శివారు గ్రామమైన వాడపాలేనికి ఆనుకుని రెండు భాగాలుగా విభజించి ఉంటుంది. రెండు కొండలకు రెండు వైపుల ఉన్న బీచ్ రెండు విభిన్న ప్రాంతాలుగా కనిపిస్తుంది. పూడిమడక వైపు ఉన్న తీరం అంతా పూర్తిగా ఇసుకతో నిండి ఉంటుంది. బీచ్‌కు ఆనుకుని ఉన్న సరుగుడు తోటల్లో పర్యాటకులు సేద దీరుతూ ఉంటారు. రెండవ వైపు ఉన్న తీరం కాస్త రాళ్లతో ఉంటుంది. రెండు కొండల మధ్య నుంచి సముద్ర తీరాన్ని చూస్తుంటే గొప్ప అనుభూతి కలుగుతుంది. అత్యంత ప్రశాంతగా ఉండే ఈ బీచ్‌లో కేవలం తీరాల ఘోష మాత్రమే వినిపిస్తుందంటే అతిశయోక్తి కాదు. ఈ బీచ్‌కు ఎటువంటి కాలుష్య సమస్య లేదు.

పర్యాటకంగా అడుగులు పడేదెప్పుడు?

ప్రపంచం మొత్తం టూరిజంపై దృష్టి పెట్టింది. దేశ ఆదాయ వనరుల్లో టూరిజానికి అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత ఉంది. ఈ క్రమంలో తంతడి వంటి కీలక బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు, పర్యాటకులను ఆకర్షించేందుకు కాటేజీలు నిర్మిస్తామన్న మాటలు ఇప్పటికీ అమలు కావడం లేదు. సరైన మార్గం లేదని ఒకసారి, నిధులు లేవని ఒకసారి, ప్రతిపాదనలు ఉన్నాయని మరొక సారి ఆయా శాఖల అధికారులు చెబుతున్నారు. అభివృద్ధి పనులకు మాత్రం బీజం పడటం లేదు.

ప్రస్తుతానికి ప్రతిపాదనలు లేవు..

గతంలో ముత్యాలమ్మపాలెం తీరంలో టూరిజం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అదే విధంగా పూడిమడక వద్ద పరిశీలన జరిగింది. తంతడి వద్ద టూరిజం అభివృద్ధికి ఎటువంటి ప్రతిపాదనలు ప్రస్తుతానికి లేవు.
– సీతారామారావు, టూరిజం శాఖ ఏఈ

షూటింగ్‌ల సందడి..

తంతడి తీరంలో పలు చిత్రాలను నిర్మించారు. ఇటీవల వెబ్ సిరీస్‌లకు కూడా ఈ బీచ్ అనువుగా మారింది. ప్రధానంగా జన సంచారం లేకపోవడం, ప్రకృతి రమణీయత వంటి వాటి వల్ల షూటింగ్ నిర్వాహకులు ప్రత్యేక దృష్టి సారించారు. తంతడి తీరం సెట్టింగ్‌లు వేసి షూటింగ్‌లు తీసే స్థాయికి వెళ్లింది. ఇక పెళ్లి షూట్‌లకైతే చెప్పనక్కర్లేదు.



తంతడిలోని ముత్యాలమ్మపాలెం బీచ్

ఆదర్శవంతంగా మూలపేట గ్రామం



తుప్పల తొలగింపు పనులు పరిశీలిస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక: మూలపేట గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు పాలకవర్గం కృషి చేస్తుందని సర్పంచ్ బీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. మండలంలోని మూలపేట రహదారికి ఇరువైపుల పేరుకుపోయిన పిచ్చి తుప్పల తొలగింపు పనులను జేసీబీ సాయంతో చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, వార్డు సభ్యులు ఆడారి సత్యనారాయణ, ఆడారి అమ్మాజీ, కాండ్రేగుల శ్రీనివాసరావు, పెద్దలు కాండ్రేగుల నాగేశ్వరరావు, బొద్దేడ ఆదికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక వెంకన్నకు గరుడ వాహన సేవ



ఇత్తడి గరుడ వాహనంపై స్వామివారికి తిరువీధి సేవ నిర్వహిస్తున్న దృశ్యం



గోదాదేవిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

నక్కపల్లి: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా ఉపమాక వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ఇత్తడి గరుడ వాహనంపై తిరువీధి సేవలు నిర్వహించారు. ముందుగా కొండపై కల్కి అవతారంలో వెలసిన స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం, నిత్యపూజలు నిర్వహించారు. దిగువన క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి, స్వామివారి ఉత్సవమూర్తులకు, గోదాదేవి అమ్మవారి సన్నిధిలోను, ఉపాలయాల్లో నిత్యార్చనలు నిర్వహించిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారిని ఇత్తడి గరుడ వాహనం పైన, గోదాదేవి అమ్మవారిని పల్లకిలో ఉంచి తిరువీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామివారికి పసుపు కుంకుమలు, కానుకలు సమర్పించుకున్నారు. అనంతరం గోదాదేవి సన్నిధిలో తిరుప్పావై పాశురాలతో నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ధనుర్మాసం శనివారం కలిసి రావడంతో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి వచ్చారు. స్వామివారి తిరువీధి సేవల్లో పాల్గొన్నారు. పూజాదికాల అనంతరం తీర్థ గోష్టి, ప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమాల్లో అర్చక స్వాములు వరప్రసాద్, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, సాయి ఆచార్యులు రాజగోపాలాచార్యులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్‌కు ఘన నివాళి



మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న అధికారులు, ప్రజా ప్రతినిధులు



మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పాయకరావుపేట: దేశానికి పదేళ్ల పాటు ప్రధాన మంత్రిగా సేవలందించిన మన్మోహన్‌సింగ్ మృతి తీరని లోటని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర జనరల్ సెక్రటరీ జగతా శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళిలర్పించారు. దేశాభివృద్ధికి మెట్లు వేసిన నాయకుడు మన్మోహన్ సింగ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి హేమంత్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాజీ ప్రధానికి నివాళి..

కోటవురట్ల: దేశాన్ని అభివృద్ధిపథంలో నడిపించిన మహనీయుడు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిరస్మరణీయుడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, వైస్ ఎంపీపీ ఆర్ఎస్ సీతారామరాజు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల సర్వ సభ్య సమావేశానికి సభ్యులు హాజరు కాగా మాజీ ప్రధాని మృతికి సంతాపంగా సమావేశాన్ని వాయిదా వేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, తహసీల్దారు తిరుమలబాబు, ఎంపీపీ సింగంపల్లి అప్పలనాయుడు, ఏవో చంద్రశేఖర్, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటలక్ష్మి

మునగపాక: స్థానిక బైపాస్ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో పలువురు భక్తులు భాగస్వామ్యం అవుతున్నారు. దీనిలో భాగంగా మునగపాకకు చెందిన టెక్కలి సురేష్ జ్ఞాపకార్థం తల్లి వెంకటలక్ష్మి శనివారం తన వంతు రూ.10 వేలను ఆలయ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు మళ్ల సంజీవరావు, కేవీఎస్ అప్పారావు, పెంటకోట శ్రీనివాసరావు, టెక్కలి కొండలరావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో సమస్యలు పరిష్కరించాలి



అధికారులతో మాట్లాడుతున్న డీఎల్‌డీవో ప్రభాకరరావు

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలని డీఎల్‌డీవో ప్రభాకరరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండల స్థాయి అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా భూ సమస్యలకు సంబంధించి రెండు వర్గాలను పిలిపించి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన ప్రతి అర్జీకి సమాధానం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు, ఎస్ఐ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ ఆడిట్‌కు సహకరించాలి



మాట్లాడుతున్న ఏపీవో యరకయ్య

ఎస్.రాయవరం: సోషల్ ఆడిట్‌లో ఫీల్డ్ అసిస్టెంట్లు డీఆర్‌పీలకు సమగ్ర నివేదిక అందజేయాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకు నిర్వహించిన పనులకు సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామన్నారు. రూ. 16.53 కోట్లతో చేపట్టిన పనులపై ఆడిట్ ఉంటుందన్నారు. వచ్చే ఏడాది జనవరిలో 11 గ్రామాల్లో ఆడిట్ జరుగుతుందన్నారు. ఆడిట్ సమయంలో గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు సహకరించి సకాలంలో పనులు పూర్తి అయ్యేలా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీవో యరకయ్య, ఏవో సౌజన్య, మండల ఇంజినీర్ దుర్గాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ పట్టణమే లక్ష్యం



శ్మశాన వాటిక వద్ద వ్యర్థాలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

యలమంచిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమం ద్వారా యలమంచిలి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ వార్డు హిందూ శ్మశాన వాటిక వద్ద సామూహిక స్వచ్ఛత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. స్వచ్ఛత అనేది ఒకరోజులో పూర్తయ్యే పని కాదన్నారు. ప్రతి ఒక్కరూ తమ నివాసాలతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. హిందూ శ్మశాన వాటిక వద్ద తుప్పలు, వ్యర్థాలను మున్సిపల్ పారిశుధ్య, సచివాలయ సిబ్బంది, అధికారులు తొలగించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, వార్డు కౌన్సిలర్లు సుంకర మరిణేశ్వ్రరావు, మజ్జి రామకృష్ణ, మేనేజర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్త్రీల ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాలి



మాట్లాడుతున్న యలమంచిలి అదనపు జూనియర్ సివిల్ జడ్జి వీరరాఘవేంద్రరావు

రాంబిల్లి (యలమంచిలి): సమాజంలో స్త్రీల ఔన్నత్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని యలమంచిలి అదనపు జూనియర్ సివిల్ జడ్జి టి. వీరరాఘవేంద్రరావు తెలిపారు. యలమంచిలి న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం రాంబిల్లి ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా మహిళలు, విద్యార్థినులకు ఉచిత న్యాయ సహాయం, చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపది ముర్ము ఒక సాధారణ కుటుంబంలో పుట్టి అత్యున్నత పదవిలో కొనసాగుతున్నారన్నారు. లైంగింక వేధింపులు, గృహహింసపై హెల్ప్‌లైన్ 15100కు ఫోన్ చేసి న్యాయ సహాయం పొందాలన్నారు. బాధితురాలి తరఫున కేసు వాదించడానికి ఎవరూ ముందుకు రాకపోతే మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సహాయం పొందవచ్చన్నారు. రాంబిల్లి సీఐ సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ గృహ హింసకు సంబంధించి గ్రామ పెద్దల వద్ద పరిష్కారం దొరకపోతే నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలన్నారు. రాంబిల్లి ఎంపీడీవో జయమాధురి, సీడీపీవో ఇందిర, యలమంచిలి బార్ కౌన్సిల్ సభ్యులు ధూళి నూకరాజు, ద్వారపురెడ్డి వెంకటరావు, నూకరాజు, రాంబిల్లి డిప్యూటీ తహసీల్దారు వెంకట్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాలతి, రాణి, డ్వాక్రా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థుల సంసిద్ధతపై పర్యవేక్షణ



విద్యార్థులకు సూచనలిస్తున్న కమిటీ సభ్యులు

పాయకరావుపేట: పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే టెన్త్ విద్యార్థుల సంసిద్ధత, 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా మండల విద్యాశాఖాధికారులు పాఠశాలలను సందర్శించారు. ఇందులో భాగంగా కె.ఎన్. గాంధీ, జి.రమేష్‌బాబు, ఇద్దరు సీనియర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోడి శ్రీనివాసరావు, ఎన్.శ్రీనివాసరావుతో కూడిన పర్యవేక్షణ కమిటీ కొత్త హరిజనవాడ బాలికోన్నత పాఠశాల, మంగవరం, గుంటపల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించారు. వీరు విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను, ఉన్నత ఫలితాల సాధనకు 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక అమలును పర్యవేక్షించారు. విద్యార్థులకు సూచనలు, సలహాలు అందించి వివిధ సబ్జెక్టుల ప్రశ్నపత్రాల బ్లూ ప్రింట్‌పై అవగాహన కల్పించారు.

వైఎస్సార్‌సీపీ నాయకులను పరామర్శించిన కంబాల



త్రిమూర్తులు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కంబాల, చిక్కాల

పాయకరావుపేట: మాసాహేబుపేట గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ గెడ్డమూరి సూర్యనారాయణ ఆపరేషన్ చేయించుకున్న సందర్భంగా ఆయనను నియోజకవర్గ ఇన్‌చార్జి కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు పరామర్శించారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు కంకిపాటి త్రిమూర్తులు అనారోగ్యం కారణంగా ఈ మధ్య చనిపోయారు. త్రిమూర్తులు కుటుంబ సభ్యులను కంబాల జోగులు, చిక్కాల రామారావు, పార్టీ నాయకులు పరామర్శించారు.

తుపాన్లతో నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి



వరి పంటను పరిశీలిస్తున్న నాయకులు

రాంబిల్లి (యలమంచిలి): తుపాను ప్రభావంతో జిల్లాలో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. శనివారం రాంబిల్లి మండలంలో మత్రిపాలెం, రజాల గ్రామాల్లో పర్యటించి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల్లో వరుసగా వచ్చిన తుపాన్ల వల్ల రైతులకు అపార నష్టం జరిగిందని, చేతకి వచ్చిన పంట నీటిపాలు అయిందని రైతులు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. రజాల, మత్రిపాలెం గ్రామాల్లో సుమారు 300 నుంచి 200 ఎకరాల వరి పంటకు నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఎకరాకు రూ. 30 వేలు చొప్పున నష్టపోయిన రైతులకు అందించాలని, మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు, సీఐటీయూ మండల కన్వీనర్ చందక రామకృష్ణ, రైతులు సమ్మెట్ల రాము, ఇల్లా గంగాధర్, మడగల అప్పారావు, మడగల శ్రీనుబాబు, ఎరికిరెడ్డి శ్రీను, ఉప్పలపట్టి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

పూడిమడకను రెండు గ్రామాలుగా విభజించాలి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారి

అచ్యుతాపురం: మండలంలోని పెద్ద జాలారిపల్లిగా ఉన్న పూడిమడకను రెండు పంచాయతీలుగా విభజించాలని అదే గ్రామానికి చెందిన చోడపల్లి అప్పారావు, వాసుపల్లి శ్రీనివాసరావు అధికారుల్ని కోరారు. శనివారం పూడిమడకలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భాగంగా వీరు అధికారులకు వినతిపత్రం అందజేశారు. అంతే కాకుండా గ్రామంలో ఉన్న 33 ఎకరాల భూమిని కొందరు రాజకీయ నాయకులు, రియల్టర్లు కలిసి అక్రమ మార్గాల్లో పొందేందుకు ప్రయత్నిస్తున్నారని, తద్వారా మత్స్యకారులకు రావాల్సిన పరిహారాన్ని కూడా సొంతం చేసుకోవడానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



చెత్త తొలగిస్తున్న నాగలక్ష్మి తదితరులు

రాంబిల్లి (యలమంచిలి): గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి అన్నారు. రాంబిల్లి మండలం సంతపాలెంలో ఆమె అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో కలిసి గ్రామంలో చెత్త తొలగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మురుగు కాలువలను పూడిక తీసి దోమలు ప్రబలకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఈవో పీఆర్‌డీ సన్యాసిరాజు, వెల్చూరు సర్పంచ్ కిల్లాడి మంగయ్యమ్మ, స్థానిక నాయకులు కిల్లాడి చిన్నా, మండల ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మేలుకొలుపు



కె.వెంకటాపురంలో సంకీర్తన చేస్తున్న భక్తులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో మేలుకొలుపు కార్యక్రమాన్ని శనివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామునే ఆలయానికి చేరుకున్న భక్తులు తొలుత ఆలయంలో దీపారాధన చేసి పూజలు చేశారు. అనంతరం గ్రామ వీధుల్లో దేవుడి చిత్రపటాలతో తిరుగుతూ సంకీర్తన చేశారు. భక్తి గీతాలు ఆకట్టుకున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు సంకీర్తన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆధ్యాత్మిక వాతావరణంతో పల్లె పరవశించింది.

గ్రావెల్ లారీ పట్టివేత



పట్టుబడిన గ్రావెల్ లారీ

కోటవురట్ల: గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న లారీని పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు ఇవి. యండపల్లి రెవెన్యూ పరిధిలో డీ పట్టా భూమిలో నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో శుక్రవారం రాత్రి దాడి చేయగా గ్రావెల్‌తో లారీ పట్టుబడినట్టు తెలిపారు. పట్టుబడిన లారీని తహసీల్దారుకు అప్పగించగా రూ.10 వేలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. ఎవరైనా అక్రమంగా గ్రావెల్, ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.